సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ఓల్డు స్టూడెంట్స్

**వి. వసంత**

సుబ్బలక్ష్మి నెమ్మదిగా మెట్లు దిగుతోంది. వెనక వస్తున్న శ్రీహరి వెనుక నుంచి "కొంచెం వేగంగా నడువు, అంత నెమ్మదేంటీ" అని అన్నాడు.

పదిహేనేళ్ళ శాంతి "అమ్మకి భూమి అరిగిపోతుందని భయం డాడీ" అని అంది.

సుబ్బలక్ష్మి ఒక్కసారి కళ్ళెత్తి వాళ్ళిద్దర్నీ చూసి నెమ్మదిగా గోడ పట్టుకొని మెట్లు దిగసాగింది.

సుబ్బలక్ష్మికి సుమారు ఏభై సంవత్సరాలుంటాయి. కొంచెం లావుగా, జుత్తు అంతా ఊడిపోయి, చిన్న ముడి పెట్టుకుంటుంది. పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత సుబ్బలక్ష్మికి ఒళ్ళు రావడం మొదలయ్యింది. సుమారు 80 కేజీలు వుండి 5.2 ఎత్తులో వున్న సుబ్బలక్ష్మిని తెల్లగా ఉన్న చిన్న ఏనుగుపిల్ల అంటూ శ్రీహరి ఏడిపిస్తూ ఉంటాడు. సుబ్బలక్ష్మికి ఒళ్ళుతో పాటు కాళ్ళునొప్పులు, గుండెదడ, అన్నిటితో నెమ్మదిగా వంటమాత్రం చేస్తూ ఇంట్లోనే వుంటుంది. శ్రీహరి ఎల్ఐసిలో పనిచేస్తూ వుంటాడు. రిటైర్మెంట్‌కి ఇంకా రెండు సంవత్సరాలలో ఉన్నాడు. అయిదు అడుగుల పది అంగుళాలు వుండి చామనఛాయతో వుండే శ్రీహరి ఇంకా కుర్రాడిలా తలకి, మీసాలకి రంగుతో సుబ్బలక్ష్మి అంటే ప్రేమవున్న సుబ్బలక్ష్మి అందాన్ని హేళనచేస్తూ వుంటాడు. ఇంక పిల్లలిద్దరూ అమ్మ రంగు, నాన్న మొహంలోని కళతో చాలా బావుంటారు. అందరికీ సుబ్బలక్ష్మి అంటే లోకువే.

ఆ రోజు శ్రీహరి కొడుకు ఫ్రెండ్‌ది పెళ్ళి. ఆ పెళ్ళికొడుకు తండ్రిది కూడా సుబ్బలక్ష్మివాళ్ళ ఊరే. అందుకే చిన్నప్పుడు చదువుకున్న స్కూల్‌ఫ్రెండ్స్ అందరినీ పిలిచాడు. సుబ్బలక్ష్మికి మనసులో ఉత్సాహం ఉన్నా బయటికి కనిపించకుండా ఉండిపోయింది.

ఆ పెద్ద మ్యారేజిహాల్లో అందరూ గుంపులు, గుంపులుగా కూర్చొని ఉన్నారు. సుబ్బలక్ష్మితో చదువుకున్న సుశీల, అన్నపూర్ణ, రవి, రాజు, శంకర్, స్వామి, రెడ్డి అందరూ కూర్చొని ఉన్నారు. వాళ్ళందరూ అప్పుడప్పుడు కలుస్తూనే వుంటారు. సడన్‌గా రాజు "ప్రసాద్, ప్రసాద్" అంటూ చప్పట్లు కొట్టి పిలిచాడు. ఏ ప్రసాదే అంటూ వెనక్కి తిరిగి చూసిన సుబ్బలక్ష్మి ఒక్కసారి ఆశ్చర్యపోయింది. ప్రసాద్ సుబ్బలక్ష్మితో కలిసి టెన్త్ వరకూ చదివాడు. ప్రసాద్‌కి సుబ్బలక్ష్మి అంటే ఆ రోజుల్లో చాలా పిచ్చి. టెన్త్ అయిపోగానే ప్రసాద్‌వాళ్ళు వైజాగ్ వెళ్ళిపోయారు. మళ్ళీ రెండుమూడు సార్లు వచ్చాడేమో, మళ్ళీ 35 ఏళ్ళ తరువాత ఇదే చూడ్డం.

దగ్గరకి వచ్చిన ప్రసాద్‌కి రాజు సుబ్బలక్ష్మిని చూపించి "ఎవరో చెప్పుకో" అని అన్నాడు. ప్రసాద్ ఒక్కసారి చూసి "సుబ్బలక్ష్మీ" అంటూ పక్కన కూర్చున్నాడు.

ప్రసాద్ ఏమీ పెద్దగా మారలేదు. పచ్చగ మంచి ఒడ్డూ పొడుగుతో అలానే ఉన్నాడు. కొంచెం చెంపలు నెరిశాయి. సుబ్బలక్ష్మిని చూసిన ప్రసాద్ కళ్ళు ఆనందంతో వెలిగాయి. శ్రీహరికి పరిచయం చేసుకొని పిల్లలని చూసి చాలా ఆనందపడ్డాడు. ప్రసాద్ శ్రీహరితో "మీరు చాలా అదృష్టవంతులు. మా సుబ్బలక్ష్మి లాంటి భార్య దొరకటం మాటలు కాదు, మీరూ మీ పిల్లలు ఇంత హాయిగా ఉన్నారు అంటే అది సుబ్బలక్ష్మి ప్రతిభే. లక్ష్మి చాలా మంచిది. అందరికీ సాయంగా ఉండేది. మా చిన్నప్పుడు సుబ్బలక్ష్మి అంటే మా స్కూల్లో అబ్బాయిలందరికీ చాలా క్రేజ్. నాకయితే మరీను" అందం, మంచితనం ఒకేచోట ఉండటం చాలా కష్టం సార్" అంటూ ఇంకా పొగుడుతూ వుంటే సుబ్బలక్ష్మి వారించి ప్రసాద్ భార్యాపిల్లల గురించి అడిగింది. అక్కడ అందరూ సుబ్బలక్ష్మిని పొగుడుతూ ఉంటే శ్రీహరికి చాలా ఆశ్చర్యం వేసింది. పెళ్ళయిన కొత్తలో సుబ్బలక్ష్మి అందాన్ని తలచుకున్నాడు. పిల్లలుకూడా అమ్మలోని మంచితనాన్ని తెలుసుకొని ఆనందించారు. ఇంటికి వస్తున్నప్పుడు శ్రీహరి నెమ్మదిగా "సారీ రా" అంటూ సుబ్బలక్ష్మి చెయ్యి పట్టుకొని నడిపించసాగాడు. కూతురికి కూడా "అమ్మని నేచురోపతిలో జాయిన్ చెయ్యండి డాడీ. తిరిగి పాత సుబ్బలక్ష్మిని తయారుచేద్దాం" అంటూ నవ్వింది.

ఆనందంగా సుబ్బలక్ష్మి నడకసాగింది.

స్వగృహ ఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building).
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net